# శుక్రవారం



"అప్పుడే తెల్లారిందా? అప్పులాళ్ళకి!" విసుక్కున్నాడు వ్యాపారి.

"మధ్యాహ్నంపూట వస్తే భోజనం వేళ ఇవ్వకూడదంటావు. సాయంకాలం వస్తే దీపాలు వెలిగించందే కుదరదంటావు. రాత్రి కొస్తే క్యాష్ క్లోజయ్యిందంటావు... అసలు ఎప్పుడు రమ్మంటావు" అడిగాడు చీటీలాయన. వచ్చే ముందు సెల్‌కి ఫోన్ చేసి రమ్మన్నాడు వ్యాపారి. "సెల్‌కి ఫోన్ చేస్తే బొంబాయిలో ఉన్నానని అనవు కదా..." సందేహంగా అడిగాడు.

అలా అప్పులాయన్ని వదుల్చుకొని, పది గంటలకు దుకాణం తెరిచాడో లేదో గుజరాతు సేటు ఆవురంటూ వచ్చి బాకీ అడిగాడు. "ఇవ్వాళ శుక్రవారం పేమెంట్లుండవు కదా..." అన్నాడు వ్యాపారి. సేటు ఆశ్చర్యంగా "వ్యాపారానికి వారాలేమిటీ?" అడిగాడు.

అప్పుడు వ్యాపారిచెప్పాడు – "భలేవాడివి భాయీ... నువ్వు ఇవ్వాల్సిన చోట వారమేకాదు, వర్జ్యమూ, రాహుకాలం కూడా చూస్తావు. నాకు తెలీదా" అని నవ్వాడు. సేటు మరింక మాట్లాడలేదు. "ఈ శుక్రవారం సెంటిమెంటు ఇవ్వాల్టిది కాదు సేటూ... వారం అంతా బాకీలు కట్టుకోవడమేగానీ, మిగిలేదేమీ ఉండదని మన పెద్దాళ్ళు శుక్రవారం సెలవు ఇచ్చారు – ఈ మాత్రం వెసులుబాటు లేకపోతే వ్యాపారాలు ఎలా చేయగలుగుతాం..." అని వివరించాడు.

సాయంత్రం కొట్టు కట్టేసేప్పుడు కొట్లో గుమాస్తా - పదిరూపాయిలు కావాలి - బియ్యానికి - అంటే, శుక్రవారం అడుగుతావేందిరా... రేపు తీసుకో అని కేకలేశాడు వ్యాపారి.

శుక్రవారం రోజు కొంచెం ఉప్పిండి తిని, కటికనేల మీద దిండులేకుండా పడుకొంటుంది వ్యాపారి ఇల్లాలు. శుక్రవారం నాడు తన శరీరానికి ఏమీ ఇవ్వకూడదని అలా ఉపవాసం చేస్తోందని వ్యాపారి నమ్మకం. అందుకని, ఇంటికెందుకులెమ్మని చింతామణి ఇంటికి వెళ్ళాడు.

"రాకరాక వచ్చారు బావగారు–" అని ఎదురేగి స్వాగతం చెప్పింది– చింతామణి చెల్లెలు చిత్ర. "మొన్నేకదే వచ్చాను" అంటే "మిమ్మల్ని ఎప్పుడు చూసినా కొత్తగా కనిపిస్తారు" అని పొగిడింది. అంత పొగిడినా వ్యాపారి స్పందించలేదని బుంగమూతి పెట్టి నుంచుంటే, చింతామణి వచ్చి వ్యాపారి జేబులోంచి పర్సులాగి, వందరూపాయలు తీసిచ్చి "ఏమైనా కొనుక్కో" అంది. వ్యాపారివైపు తిరిగి "అదెందుకూ మన మధ్య అడ్డం" అంటూ పర్సుని బీరువాలో పెట్టి తాళం వేసింది. గతుక్కుమన్నాడు వ్యాపారి.

ఇంటికి వెళ్ళేప్పుడు "మరి నా పర్సో" అడిగాడు. అప్పుడు చింతామణి తల్లి శ్రీహరి వచ్చి "శుక్రవారం పూట చేతికొచ్చిన డబ్బు తిరిగి ఇచ్చే అలవాటు లేదు అల్లుడుగారూ మాకు!" అంది. ●

## 'జీవి'తం కథలు